# తప్పిపోయిండు

"కిషన్ రావు దొర పట్నం తోల్కపోతనన్నడే ! ఏడాది జీతం ఒక్కసారె ఇచ్చి పనికి కుదిరిచ్చుకుంటనన్నడు !" మైసయ్య గొంతులో ఆనందం విషాదం రెండూ ధ్వనించాయి.

చెంద్రయ్యను ఎవరైన జీతానికి పెట్టుకుంటె బాగుండును. కొంత దరిద్రమైన తీరుతదనుకుంటున్నాడు. మైసయ్య కొన్నాళ్ళ నుంచే, దానికోసం ప్రయత్నాలు కూడా చేసాడు. ఆఖరికి కిషన్‌రావు దొర పట్నంలో వాళ్ళింట్లో పని చేయడానికి పిల్లగాడు కావాలని అడుగుతున్నాడని తెలిసి మైసయ్య ఉరుక్కుంటూ వెళ్ళాడు. జీతం మాట్లాడుకునే వచ్చాడు.

"పట్నం ఎప్పుడు తోల్కపోతడంట సెంద్రయ్యను" అడిగింది లచ్చి. ఆమె గొంతులో కొడుకు అప్పుడే వెళ్ళిపోయాడన్నంత బాధ ధ్వనించింది.

చెంద్రయ్యకు పదేళ్ళయినా లేవు. వాడి తర్వాత లచ్చికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఆఖరుది చంటిపిల్ల రెండేళ్ళది. ఇంటికి పెద్దవాడు చెంద్రయ్య. వాడు పెద్దవాడైతే ఒంటరి వాడైన తండ్రి మైసయ్యకు వ్యవసాయం పనుల్లో ఆసరాగా వుంటాడనుకుంది లచ్చి. కాని వరుసగా నాలుగేండ్లు వర్షాల్లేక వ్యవసాయం మూలపడ్డట్లే అయింది. మైసయ్యే కూలిపనులకు పోతున్నాడు. లచ్చి కూలి మైసయ్య కూలి ఇద్దరి కూలితో ఇల్లు గడుస్తలేదు. ఇంకో దిక్కు వ్యవసాయానికి చేసిన అప్పు వడ్డీ పెరిగిపోతున్నది. అసలూ వడ్డీ చెల్లించమని ఈశ్వరయ్య గొంతు మీద కూర్చున్నాడు. ఈ పరిస్థితుల్లో చెంద్రయ్యను ఎక్కడైన జీతముంచి ఆ పైసలతో అప్పు తీర్చాలనుకున్నాడు మైసయ్య.

చెంద్రయ్య కొన్నాళ్ళు స్కూలుకు వెళ్ళాడు. కాని గొడ్లను మర్లేసేటందుకు జీతగాన్ని ఎక్కడ పెట్టమని మైసయ్య చెంద్రయ్యను స్కూలు మాన్పించి గొడ్లకాపరిని చేసాడు.

మైసయ్యకు రెండు బర్రెలు రెండు దూడెలున్నాయి. రెండు బర్రెలు ఒక్కసారే ఈనేటట్లున్నాయి. వాటి సంరక్షణ ముఖ్యం. రెండు నాగలికి కట్టే బక్కఎద్దులున్నాయి. మైసయ్య కూలికి పోతే ఆ గొడ్లను చూసుకునేటందుకు ఎవరు లేరు. మైసయ్య ఆ పనిని కొడుక్కు అప్ప జెప్పాడు.

స్కూలు మానేసి గొడ్లకాపరిగా మారినప్పుడు చెంద్రయ్యకు నెక్కరు అంగీ వుండేయి. భుజం మీదికి కండువా పేరుతో తల్లి ఇచ్చిన గుడ్డ పేగును గోచీగా పెట్టుకొని, గొడ్లను కాసే దగ్గర ఈతలు కొట్టేవాడు. తర్వాత వుతికి ఆరేసిన ఆ నెక్కరు అంగీలను వేసుకునేవాడు చెంద్రయ్య మెలమెల్లగా అవి చిరిగిపోయాయి. కొన్నాళ్ళు చిరిగిపోయిన నెక్కరు మాత్రం

వేసుకొని తిరిగేవాడు. అదీ పేగు పేగయింది. అప్పుడు తల్లి ఓ పాతగుడ్డను ఇచ్చింది మొలకు కట్టుకొమ్మని. ఆ గుడ్డను నడుంకు చుట్టుకొని మీదికి మొలతాడు బిగించుకొని గోచిలాగా వెనుకకు అంచులు లాగి చెక్కుకున్నాడు. అంగీ లేకుండా వానలో ఈదురు గాలిలో తిరిగే కొడుకును చూస్తే మైసయ్య గుండె నీరయింది.

"నా కొడుకును చదివిస్తననుకున్న ఎవసాయం మూలబడి గిప్పుడేమో ఆనికి కడుపునిండ తిండి ఒంటినిండా బట్టయిన లేవు. గిట్ల అయిపాయె!" అని బాధపడ్డాడు.

ఊర్లో వాళ్ళు కొంతమంది తమ బర్రెలను చెంద్రయ్య కాసే గొడ్ల జతకు తోలడంతో నాలుగు డబ్బులు చేతిలో పడ్డాయి మైసయ్యకు. ఆ డబ్బు పెట్టి లచ్చి దసర పండుగకు చెంద్రయ్యకు నెక్కరు అంగీ పట్టించింది. కొత్తబట్టలు చూసుకొని మురిసిపోయాడు చెంద్రయ్య.

పొద్దున్నే తల్లి యిచ్చిన పెరుగు అన్నం తొక్కుతో కట్టిన సద్దిమూట తీసుకొని గొడ్లను తోలుకొని ఊరి బయటికి పోతాడు. ఇంకో నలుగురు గొడ్లతో కలుస్తారు. పంటల కాలంలో అయితే గొడ్లను ఎవరి చేనులో జొరబడకుండా చూసుకోవడమే వాళ్ళకు కష్టంగా వుంటుంది. ఎండాకాలమైతే ఏ బాధ లేదు. గొడ్లను చెరువు పక్కన వదిలేసి పిల్లలందరూ హాయిగా కబడ్డి చెర్నగోలలు ఆడుకుంటారు. నీళ్ళుంటె చెరువులో లేకపోతే దగ్గరలో వున్న దిగుడుబావిలో ఈతలు కొడ్తారు. ఆ తర్వాత సద్దిమూటలు విప్పుకొని అందరూ కలిసి తింటారు.

గొడ్లను కాసే పిల్లలకు చెంద్రయ్య నాయకుడయ్యాడు. అతడేం చెప్తే మిగతా పిల్లలు అదే చేస్తారు. అతడే ఆట ఆడాలంటే అదే ఆట ఆడ్తారు. జహంగీరు పీర్ల జాతరకు పోయి ఒక పిల్లవాడు పిల్లనగోవి తెచ్చి చెంద్రయ్యకిచ్చాడు. చెంద్రయ్య దాన్ని పెదవులకు ఆనించి ఊదాడు. సన్నని రాగం వచ్చింది. ఇక చెంద్రయ్య పిల్లనగోవిని వదల్లేదు. దాన్ని పెదవులకు ఆనించి ఏవో రాగాలు తీయడం అతనికి ఆనందంగా వుంది.

ఈతలు కొట్టడం, సద్దులు తినడం అయ్యాక పిల్లలు గొడ్లను కాస్త మర్లేసి నీళ్ళు తాగించి అవి నీడల్లో చేరి నెమరులు వేస్తుంటే వాళ్ళు మళ్ళీ ఆటల్లోకి దిగుతారు. పొద్దు గూకుతుందనగ గొడ్లను తోలుకొని ఇండ్లకుపోతారు ఎవరి గొడ్లను వాళ్ళ ఇండ్లకు చేరేసి పలుపుతాళ్ళతో గుంజలకు కట్టేసి కుడితిని తాగించి వాటి ముందు ఇంత గడ్డిమేత వేసి పిల్లలు వాళ్ళ గొడ్లతో వాళ్ళ ఇండ్లకు చేరుతారు.

రాత్రి తండ్రి వచ్చినాకనే లచ్చి అందరికీ ఒక్కసారే అన్నం పెడ్తుంది. అందరు కలిసి తినడం అలవాటు. ఆ తర్వాత పడుకోవడం. రాత్రి చల్లగా వుంటె ఇంట్లోనే పండు కోవడం. లేకపోతే నులక మంచమేసుకొని బయట నీలాకాశం కింద చుక్కలవైపు చూస్తూ చెంద్రయ్య నిద్రలోకి జారుకుంటాడు. ఆకాశంలో చుక్కలను చూస్తే అతనికి ఆనందం.

"అమ్మ గీ చుక్కల దగ్గరికి మనం పోవచ్చునానె" అడిగాడు ఒకసారి చెంద్రయ్య తల్లిని

వాడి ప్రశ్నకు తల్లి నవ్వింది.

"చుక్కలు మనకు అందవురా! మనం పోతా వుంటె చుక్కలు ఇంకా ఎత్తుకుపోత యట!"

"అంటె ఇమానంలో గూడ పోలేమ?" అడిగాడు చెంద్రయ్య.

"ఏమోరా! గదంత నాకెరుక లేదు" అని లచ్చి చెంద్రయ్య తలమీద చెయ్యేసి మునివేళ్ళతో దువ్వింది.

అదే ఆలోచనలతో చెంద్రయ్య నిద్రలోకి జారుకున్నాడు.

మైసయ్య చెంద్రయ్యను దొర దగ్గర జీతం కుదిరించుకొని వచ్చినరోజు చెంద్రయ్య ఇంటికి రాగానే "అయ్య! గొడ్ల జతకు మేకలు కొంటనంటివి. ఎప్పుడు కొంటవే!" అని అడిగాడు.

మైసయ్య కాస్సేపు ఏం మాట్లాడలేకపోయాడు. కొడుకువైపు గుడ్లప్పగించి చూసాడు. తేరుకొని "గిప్పుడు మేకల్లేవు ఏం లేవుర! నిన్ను కిషన్‌రావు దొర కాడ జీతం మాట్లాడిన. ఇల్లు గడవాలంటె మన అప్పు తీరాలంటె గదొక్కటె తోవ కన్పించిందిర ! పట్నంల దొర ఇల్లు వుందిగద! గక్కడ పన్జేయాలంట పోతవ!" అడిగాడు మైసయ్య. అతని గొంతు ఆర్ద్రంగా వుంది.

తండ్రి మాటలు విని చెంద్రయ్య కండ్లు ఇంకా పెద్దగయ్యాయి.

"పట్నమా?" అన్నాడు.

"అవున్రా ! పట్నం. గక్కడ ఇంటిపట్టున వుండి ఇంట్ల పని చేసుకొని గింత సదువు నేర్సుకొని బుద్ధివంతునివి కావాలె! ఎరుకయింద ? నీకు తిండికేం తక్కువుండదు దొర కాడ" అంది లచ్చి కొడుకువైపు చూస్తూ. తల్లి కండ్లల్లో ఏదో బెరుకు కన్పించింది చెంద్రయ్యకు.

చెంద్రయ్య ఏం మాట్లాడలేదు.

పిల్లనగోవి ఊదడం, ఈతలు, కబడ్డీ, చెర్నగోల ఆటలు అవన్నీ అక్కడ వుంటయా? అనుకున్నాడు చెంద్రయ్య.

అతనిలో ఏదో దిగులు జొరబడింది. మాట్లాడకుండా పడుకొని నిద్రపోయాడు. కాని సరిగ్గా నిద్రపట్టలేదు. చిమ్మని చీకట్లో అతన్నెవరో పట్టి గుంజుకపోతున్నట్లు కల వచ్చింది. ఉలిక్కి పడి లేచాడు. మళ్ళీ నిద్ర పట్టలేదు.

మసక చీకట్లోనే చెంద్రయ్య లేచి గొడ్ల పలుపుతాడులను విప్పుతున్నది చూసాడు మైసయ్య.

"గింత ఎగిలివారంగ ఎక్కడికిర? అయిన గియ్యాల గొడ్లను తోల్కపోకు. నిన్ను దొర తీస్కరమ్మన్నడు. చూస్తడట" అన్నాడు.

చెంద్రయ్య ఏం మాట్లాడకుండా తండ్రి వెంట బయలుదేరాడు.

బంగ్లాలో దొర ఒక్కడే వున్నాడు. భార్య పిల్లలు అందరూ పట్నంలోనే వుంటారు. పిల్లల చదువుల కోసం దొర పట్నంలో ఇల్లు కొన్నాడు. అందరూ అక్కడే వుంటారు. దొర మాత్రం ఊరికి వచ్చిపోతూ వ్యవసాయం చూసుకుంటాడు.

"వీడేనా నీ కొడుకు! ఆ మంచిగనే వున్నడు" అన్నాడు దొర చెంద్రయ్యను చూసి.

"ఏందిరా ! మీ నాయన చెప్పిండా నిన్ను పట్నం తోలుతున్న అని" దొర చెంద్రయ్య వైపు చూస్తూ అన్నాడు.

చెంద్రయ్య తలొంచుకొని ఏం మాట్లాడలేదు.

"పోరడు మంచిగనే వున్నడు. నేను ఈరోజే మధ్యాహ్నం బస్సుకు పట్నం పోతున్న. వీన్ని తీస్కపోత మరి!" అన్నాడు కిషన్‌రావు దొర.

"ఇంత జల్దీనా" దిగులుపడ్డాడు చెంద్రయ్య మనస్సులోనే.

"సరే మీ ఇష్టం దొర!" అని దొర ముఖంవైపు చూసాడు మైసయ్య.

"వాడ్ని ఇక్కడ్నే వుంచి పో" అన్నాడు దొర.

"దొర! ఆని– జీతం–" నసిగాడు మైసయ్య.

"హో ! జీతమా !"

"అవును దొర. సంవత్సరం మొత్తం జీతం ఒక్కసారే ఇస్తమంటి. అప్పు గట్టేదుంది దొర!" మళ్ళీ నసిగాడు మైసయ్య.

పెద్దగా నవ్వాడు కిషన్‌రావు దొర.

"సరే ! లోపలిరా. ఇస్తాను" అని దొర బంగ్లలోకి దారి తీసాడు. మైసయ్య అతన్ని అనుసరించాడు.

చెంద్రయ్య బయటనే నిలబడ్డాడు.

"పట్నంల అమ్మను, నాయినను, తమ్ముండ్లను, చెల్లెండ్లను అందర్ని ఇడిచిపెట్టి ఎట్లుండాలెనో ఏందో? పోను అని అందమంటె అయ్య అంత ఎరికుండె గీ జీతం మాట్లాడిండు. గీ జీతం లేకపోతె గీ కరువు కాలంల ఇంట్ల అందరు ఆకలితో సచ్చిపోతరు. దొర ఏడాది జీతం ఒక్కసారె ఇస్తనన్నడు. గీ జీతం పెట్టి అయ్య ఒడ్ల గింజలు కొంటనన్నడు. ఇంత అప్పు కడ్తనన్నడు. గిక్కడ ఏమున్నది! గొడ్లను మేపెటందుకు గీ యేడు పచ్చగడ్డి కూడా వుండదు. గొడ్లను కాసే పని కూడా వుంటదో వుండదో! కరవు కాలానికి శానామంది గొడ్లను అమ్ముకుంటున్నరు! అన్న అయ్య మాటలు నిజమే! అందుకే గీ జీతం మాట్లాడిండు' అనుకుంటూ నిలబడ్డాడు చెంద్రయ్య.

చినిగిపోయిన కండువలో చుట్టుకున్న నోట్లకట్టతో మైసయ్య బయటికి వచ్చాడు. కొడుకు వైపు చూసాడు. అతన్ని చూపుల్లో అసహాయత చోటు చేసుకుంది.

"చెంద్రయ్య ! దొరతో పట్నం పో ఇగ. మంచిగుండు. మంచిగ పన్జేయి. ఏం మాట రావొద్దు మరి! దొర పొట్టకు బట్టకు ఏం తక్కువ చేయడు. సరేనా! నేను పోత ఇగ.

దొర ఎంబడి పో! మీ అమ్మకు సెప్త నేను'' అన్నాడు మైసయ్య చెంద్రయ్యతో. మైసయ్య కండ్లల్లో కన్నీరు నిండింది. చినిగిన కండువకు కండ్లు తుడుచుకున్నాడు. దొరవైపు చూసాడు.

''దొర! ఆనికి గొడ్లు కాసుడే ఎరుక గిందనుక. ఇంట్ల పని నేర్పితే నేర్సుకుంటడు దొర!'' అన్నాడు మైసయ్య. మైసయ్య కొడుకును విడువలేక విడువలేక అక్కడ్నుంచి కదిలాడు.

మధ్యాహ్నం బస్సుకే చెంద్రయ్య దొరతో బస్సు ఎక్కాడు. కూలికి పోయిన లచ్చికి ఈ విషయం మైసయ్య చెప్పగానే ఉరుక్కుంటూ వచ్చింది. కిటికి పక్కన కూర్చున్న చెంద్రయ్యను చూసింది. లచ్చి కండ్లపొంటి ధారగా నీళ్ళు కారుతున్నాయి.

''చెంద్రయ్య! నాయన! పోతున్నవ! గక్కడ పట్నంల పదిలం కొడుక! ఎవరి జోలికి పోకు. ఆగంగాకు బిడ్డ! జాగర్త నాయిన! బుద్ధిగుండు. సెప్పిన పని మంచిగ సెయ్యి'' ఏడుస్తున్న తల్లిని చూస్తే చెంద్రయ్యకు ఏడుపు వచ్చింది.

పొద్దున దొర ఇంటికి బయలుదేరినప్పుడు తల్లి నెత్తికి మంచినూనె పెట్టి నున్నగ దువ్వింది. చేతికున్న నూనెను ముఖానికి రాసింది. దాంతో చెంద్రయ్య నిగనిగలాడుతూ కన్పించాడు.

''కొడుక ! నువ్వు పొంగనె దొర బట్టలు పట్టిస్తడు. బుగులు పడొద్దు. మంచిగుండు కొడుక!'' అంది లచ్చి బస్సు పక్కన నిలబడి.

''నీ కొడుకు గిట్లనె వుంటడ! పట్నంల వున్నంక నీ కొడుకు ఎట్ల అయితడొ చూడు!'' అని దొర పెద్దగా నవ్వాడు.

బస్సు కదిలింది.

''పట్నంల భద్రం నాయిన! ఎక్కడికి పోకు ఒక్కనివి కొడుక! కాటగలిసిపోతవు!'' అంటూ బస్సు వెంట పరిగెత్తింది లచ్చి.

చెంద్రయ్య కండ్లల్లో నీళ్ళు నిండాయి. తల కిటికీలో నుంచి బయటికి పెట్టి తల్లిని చూసాడు కనపడిందాకా.

బస్సు వేగంగా పరిగెత్తింది. బస్సులో కూర్చున్న చెంద్రయ్య నిశ్చలంగా కూర్చున్నాడు. బయట పరిగెత్తే చెట్లవైపు చూస్తుండిపోయాడు.

పట్నంలో కిషన్‌రావు దొర ఇల్లు పెద్దది. చుట్టూ చిన్న తోట వుంది.

''అమ్మో ! ఎంత పెద్ద ఇల్లో!'' అనుకున్నాడు చెంద్రయ్య.

కాని తర్వాత తెల్సింది చెంద్రయ్యకు. ఆ ఇల్లంతా దొరది కాదని. దాంట్లో ఓ యాభైదాక ఇండ్లు వున్నాయి. వాటిని పట్నంల 'ఫ్లాట్లు' అంటారు. ఆ ఫ్లాటులో ఒక హాలు రెండు అర్రలు, ఒక చిన్న వంటిల్లు వున్నాయి. ఎప్పుడు ఇంటి ముంగలి తలుపులు పెట్టుకునే ఇంట్ల వుండాలె! ''తలుపులు తియ్యగూడదుర గిక్కడ'' చెప్పాడు దొర లోపలికి వెళ్ళగానే.

చెంద్రయ్యకు గాలి బిగించినట్లయింది. మొసమర్ల లేదు. అయినా నిశ్చలంగా నిలబడ్డాడు చెంద్రయ్య.

"వంట ఏమైన ఒస్తద" అడిగింది దొర్సాని.

"వాడు గొడ్లు కాసిండు ఇన్నాళ్ళు. పని నేర్పాలె" అన్నాడు దొర.

"గంతే. పని నేర్చుకొంగనే పోతరు" ముఖం తిప్పేసింది దొర్సాని.

దొరకు ముగ్గురు పిల్లలు. పెద్దవాళ్లిద్దరు ఆడపిల్లలు. ఒక కొడుకు. ఇద్దరాడ పిల్లల తర్వాత పుట్టాడు కొడుకు. కొడుకంటే చాల ముద్దు దొరకు దొర్సానికి. వాడు ఏది అంటే అది అప్పుడే కావాలి. వాడు గుర్రమంటె గుర్రం గాడిదంటె గాడిద కావల్సిందే లేకుంటె దొర్సాని కోప్పడుతుంది. వాడు స్కూలు బ్యాగులోంచి స్కేలు తీసి చెంద్రయ్యను కొడ్తాడు.

పొద్దున్నే పిల్లలు స్కూలుకు పోయేదాకా వాళ్ళకేం కావాలో చెంద్రయ్య చూసు కోవాలి. వాళ్ళ స్కూలు బ్యాగులు మోసుకుంటు వాళ్ళను స్కూలు బస్సు దాకా తీసుక పోవాలి. బస్సు వచ్చేంతవరకు వుండి వాళ్ళను బ్యాగులతో బస్సు ఎక్కించింతర్వాతనే చెంద్రయ్య అక్కడి నుంచి కదలాలి. బస్సు రావడం ఆలస్యమైతే చెంద్రయ్య ఇంటికి రావడం ఆలస్యమౌతుంది. అప్పటికే దొర్సాని కోపంతో

"ఎక్కడ చచ్చినవుర గింతసేపు" అని అరుస్తుంది.

చెంద్రయ్య మాట్లాడకుండా పనిలోకి దిగుతాడు. గిన్నెలు తోమి మెరిసేటట్లుగా గుడ్డతో తుడిచి ఎక్కడివక్కడ సర్దుతాడు. ఇల్లు ఊడ్చి తుడుస్తాడు. ఇల్లంతా పాలరాయి పరిచి వుంది. పాలరాయిని తెల్లగా మెరిసేటట్లు తుడ్వాలి. లేకపోతే "గదేం తూడ్చు డురా!" అని దొర్సాని చెంద్రయ్య నెత్తిమీద పొడుస్తుంది.

"గా పొడుసుడు ఎక్కడ నేర్సుకుందో దొర్సాని. గా మొట్టికాయలకు నెత్తంతా పోటు తీస్తది!" అనుకుంటాడు చెంద్రయ్య బాధతో.

ఒకసారి అట్లానే దొర్సాని పొడ్వబోతె ఆ దెబ్బను తప్పించుకునేందుకు చెంద్రయ్య తల పక్కకు వంచాడు. అంతే ! దొర్సాని పోయి గోడకు గుద్దుకుంది. చెయ్యి గోడకు కొట్టుకపోయి రక్తం కారింది.

ఇగ దొర్సానికి కోపం వచ్చింది. చేతికి ఏది దొరికితే దానితో మొస వచ్చేదాక చెంద్రయ్యను కొట్టింది. చెంద్రయ్య ఒళ్ళంతా దెబ్బలతో పుండయింది. రాత్రి జ్వరం వచ్చింది.

రాత్రి చెంద్రయ్య వంటింట్లో పడుకుంటాడు. వంటింట్లో గద్దెపోగా ఒక మనిషి నిలబడే జాగానే వుంది. ఆ జాగాలోనే చెంద్రయ్య దొర్సాని ఇచ్చిన పాత చెద్దరు వేసుకొని పడుకుంటాడు. ఒక్కడే చీకట్లో ఆ ఇరుకు జాగాలో పడుకొని చెంద్రయ్య కప్పువైపు చూస్తూ కొస్సేపట్లో నిద్రలోకి జారుకుంటాడు. పొద్దంతా ఒక నిమిషం తీరిక లేకుండా

ఒళ్ళంతా హూనమయ్యేటట్లు పనిచేసే చెంద్రయ్యకు నిద్ర రావడానికి ఎక్కువసేపు పట్టదు. రాత్రి ఎలుకలు జిర్రలు ఎన్ని ఒంటి మీద పాకుతాయో చెంద్రయ్యకు సోయి వుండదు. ఎప్పుడైన దొర ఊరి నుంచి వస్తుంటాడు. ఎప్పుడు వచ్చినా ఆయన ఊర్లో పని చూసుకొని ఆఖరి బస్సుకు వస్తాడు. ఆయన పట్నంల ఇంటికి చేరు కునేసరికి బాగా రాత్రి అవుతుంది. దొర చక్కంగా వంటింట్లోకి వచ్చి "ఏందిర చెంద్రిగా! అప్పుడే పండుకున్నవ? లే! నేను స్నానం చేయాలె బాత్రూంలో ఉడుకు నీళ్ళు పెట్టు" అంటూ కాలితో చెంద్రయ్యను తన్నుతూ లేపుతాడు.

దొర స్నానం చేసి అన్నం తిని పండుకున్న దాకా చెంద్రయ్య అతని వెంట వుండవల్సిందే. దొర్సాని లేచిరాదు. చెంద్రయ్యే అన్ని పనులు చూసుకోవాలి. పడుకునేసరికి అర్ధరాత్రి దాటుతుంది. మళ్ళీ చెంద్రయ్య పొద్దున్నే చీకట్లోనే లేచి కిందికిపోయి మంచినీళ్ళు పట్టి తేవాలి. ఆలస్యంగా పోతే నల్లా బందు అవుతుంది.

చెంద్రయ్యకు రాత్రి పండుకునేటప్పుడు వంటింటి చిన్న కిటికీలోంచి అదీ శుక్ల పక్షమైతే నీలాకాశం కాస్త కన్పిస్తుంది. లెక్క పెట్టేందుకు ఇక్కడ చుక్కలే కన్పించడంలేదు చెంద్రయ్యకు. వెంటనే చెంద్రయ్యకు తన ఆటలు పాటలు చల్లనిగాలి ఈతలు యాదికి వస్తాయి. తల్లీ తండ్రి తమ్ముండ్లు చెల్లెండ్లు యాదికి వస్తారు. అతని మనస్సంతా ఎట్లనో అవుతుంది. "మళ్ళ ఎప్పుడు గట్ల తిర్గుత నేను!" అని అనుకుంటాడు. చెంద్రయ్య కండ్లల్లో నీళ్ళు నిండుతాయి.

"గిక్కడ ఎప్పుడు బయటికి పోయె తీరికేలేదు. పోయిన ఎక్కడికి పోవాలె. గిక్కడ పట్నం నాకేం ఎరుకలేదు. పట్నం శాన పెద్దగుంటదట! నాకు పుర్సతే లేదు గిక్కడ. దొర్సాని గిప్పుడు వంట కూడా నేర్పుతున్నది. ఇగ ఊపిరి మెసలని పనులు!" నిట్టూరుస్తాడు చెంద్రయ్య.

ఒకరోజు దొర్సాని స్నానానికి పోయింది. చెంద్రయ్య వంటింట్లో వున్నాడు. ఆమె స్నానం చేసి బయటికి వచ్చింది. "చెంద్రిగా !" అని కేకపెట్టింది దొర్సాని. ఆమె కేక విని వంటింట్లో పచ్చి పులుసులో పోపు పెడ్తున్న చెంద్రయ్య అదిరిపోయాడు. చేతిలో పని వదిలేసి ఉరుక్కుంటు బయటికి వచ్చాడు. ఆమె కోపంతో భయంకరంగా కన్పించింది.

ఏదో జరగకూడదనిదే జరిగిందనుకున్నాడు చెంద్రయ్య. భయంతో వాడి కళ్ళు ఇంకా పెద్దవయ్యాయి.

"ఒరే ! గిక్కడ బంగారు గొలుసు పెట్టిన తీసినావుర!" అని అడిగింది దొర్సాని అరుస్తూ.

"గొలుసా ! నాకెరుక లేదు దొర్సాని. నేను గప్పట్నుంచి వంటింట్లనే వున్న. బయటికి రాలేదు" భయంగా అన్నాడు చెంద్రయ్య.

"గొలుసు తియ్యంది గంత భయపడ్తున్నవెందుకురా! చెప్పు!" అని దొర్సాని చెంద్రయ్య జట్టుపట్టి గుంజింది.

నూనె లేక ఎండిపోయిన కొబ్బరిపీచు లెక్కవున్న చెంద్రయ్య జుట్టును దొర్సాని చేయి వదలలేదు.

"నిజం చెప్తున్న దొర్సాని! గొలుసు నా కెరుకలేదు" చెంద్రయ్య గొంతు ఏడ్పుతో నిండిపోయింది. కండ్ల పొంటి పటపటమని నీళ్ళు కారాయి.

"దొంగ ఏడ్పు ఏడ్వకురా! నువ్వు గిట్లజెప్పవ్. నా కెరుకే ! పోలీసులకు అప్పజెప్తే గప్పుడు నిజం కక్కుతవ్!" అని దొర్సాని చెంద్రయ్య జుట్టును వదిలేసి ఫోను నెంబరు తిప్పింది. పోలీసులను పిల్చింది.

కాస్సేపట్లో ఇద్దరు పోలీసులు చేతిలో లాఠీలతో దిగారు.

గొలుసు ఎక్కడ పెట్టింది ఎప్పుడు చూసుకుంది అంతా వివరంగా పోలీసులకు చెప్పింది దొర్సాని. ఇంట్లో అప్పుడు చెంద్రయ్య తప్ప ఎవరూ లేరని చెప్పింది.

"వాడు తప్ప ఎవ్వరూ తియ్యలేదండ్రి ఇన్‌స్పెక్టరు సాబ్! వీడే ఆ గొలుసు కాజేసిండు. ఎవరికో చిటికెలో ఇచ్చి పంపించిండు! వీడు మంచిమాటతోటి చెప్పేటట్లు లేడు. తోమితేనే అసలు సంగతి బయటపెడ్తడు. మామూలు పిండం కాదు వీడు" అంది అంతా చూసినట్లుగానే దొర్సాని.

పోలీసులు చెంద్రయ్యను పోలీసుస్టేషన్ తీసుకపోయారు. లాకప్‌లో పెట్టారు. లాఠీలతో కొట్టారు.

"గొలుసు ఎవరికిచ్చావో చెప్పు!" అని హింసలు పెట్టారు.

"నేను దొంగతనం చేయలేదు. దొంగను కాను" అని ఎన్నిసార్లు చెప్పినా పోలీసులు వినలేదు. ఇంకా కొట్టారు.

దెబ్బలతో చెంద్రయ్య ముఖమంతా ఉబ్బింది. నెక్కరు అంగీ చిరిగిపోయాయి. ఒళ్ళంతా దెబ్బలతో చిట్లిపోయి రక్తం కారింది. ఆ రాత్రి చెంద్రయ్య లాకప్‌లోనే వున్నాడు.

ఆ రాత్రి కిషన్‌రావు దొర ఊరి నుంచి వచ్చాడు. గొలుసు చోరీ అయిన సంగతి విన్నాడు. "బద్మాష్‌గాడు ఎంతపని చేసిండు. దొంగముండా కొడుకు. దెబ్బలు పడితే వాడే నిజం కక్కు తడు" అన్నాడు దొర.

తెల్లవారి ఇంట్లో చెంద్రయ్య లేకపోవడంతో ఎవరూ కింద నుంచి మంచినీళ్ళు మోసుక రాలేదు. హోటల్లో నుంచి టిఫిన్లు తెచ్చుకొని తిన్నారు. అందరూ పిల్లలు అవే టిఫిన్లను డబ్బాలో పెట్టుకొని వాళ్ళ బ్యాగులు వాళ్ళే మోసుకుంటూ స్కూళ్ళకు వెళ్ళారు.

ఇంట్లో పనంతా అట్లానే వుంది. పూచికపుల్ల కదలలేదు. పిల్లలను స్కూళ్ళకు పంపించి అలసిపోయింది దొర్సాని. కర్చీఫ్‌తో చెమట తుడుచుకుంటూ డ్రెస్సింగు టేబిల్ దగ్గర నిలబడి తన ఫిగర్ ఒక్కసారి నిలువుటద్దంలో చూసుకుంది. అటు యిటు తిరిగి అన్ని కోణాల నుంచి పరిశీలించుకుంది. అంతే ! అద్దం ముందు మెరుస్తూ అద్దంలో ప్రతిబింబం కన్పించింది.

"గిదేంది! గొలుసా యేంది!" అని దొర్సాని ఒంగి డ్రెస్సింగ్ టేబిల్ మీద క్రీమ్ బాటిల్ వెనుకున్న గొలుసును చేతిలోకి తీసుకుంది.

"అయ్యో ! గొలుసు గిక్కడ పెట్టిన్నా ! ఫ్రిజ్ మీద పెట్టిన అనుకున్న" అని ఆశ్చర్య పోయింది దొర్సాని. అర బయటికి హాల్లో పేపరు చదువుతున్న దొర దగ్గరికి ఉరికింది.

"అయ్యో చెంద్రిగాన్ని విడిపించుక రండ్రి ఎక్కడి పని గక్కడ్నే వున్నది. జల్ది పొండ్రి!" అని భర్తను తొందరపెట్టింది దొర్సాని.

దొర సంగతంతా విని దబదబ చెప్పులేసుకొని పోలీసు స్టేషన్ బయలుదేరాడు.

"వాడ్ని విడిచిపెట్టండ్రి. మేము కేసు విత్ డ్రా చేసుకుంటం. పాడు గొలుసుపోతే పోయింది ఇన్‌స్పెక్టరు ! నేను కేసు వాపసు తీసుకుంట" అని అన్నాడు ఇన్‌స్పెక్టర్‌తో.

ఇన్‌స్పెక్టరు వెంటనే కేసు వాపసు తీసుకోవడానికి ఒప్పుకునేటట్లు కన్పించలేదు దొరకు. జేబులోంచి కొంత డబ్బు తీసి ఇన్‌స్పెక్టర్ చేతిలో పెట్టాడు.

సోయి లేకుండా వున్న చెంద్రయ్యను తెచ్చి దొరకు అప్పగించాడు ఇన్‌స్పెక్టరు. రక్తంతో తడిచిపోయి వున్నాడు చెంద్రయ్య.

"చాల గొట్టిన్రు పోరన్ని" అనుకున్నాడు దొర. పైకి ఏమీ అనలేదు.

"రారా ! చెంద్రిగా! ఇంటికి పోదం" అన్నాడు దొర.

చెంద్రయ్య వినే స్థితిలో లేడు. వాడి కళ్ళు మూతలు పడిపోతున్నాయి.

"రారా ! పోదాం !" అని దొర చెంద్రయ్య చేయి పట్టుకొని పోలీసుస్టేషన్ బయట నిలబడ్డ ఆటోవైపు గుంజుకపోయాడు. చెంద్రయ్య ఒళ్ళు జ్వరంతో కాలిపోతున్నది.

"ఇంట్ల పనంత అట్లనే పడి వున్నది. రారా చెంద్రిగా! జల్ది జల్ది నీ పని చేసుకో" అంది దొర్సాని. లాలిస్తున్నట్లుగా వుందామె గొంతు. ఆ రోజంతా చెంద్రయ్యకు పని తప్పలేదు. ఒంట్లో సోయి లేకున్నా పని చేసుకపోయాడు. రాత్రయింది. అందరూ భోంచేసారు. టివీ చూస్తున్నారు. చెంద్రయ్యకు వంటింట్లో పండుకోబుద్ధి కాలేదు. లేచాడు. ముందు తలుపువైపు నడిచాడు. ఇంట్లో ఎవరూ అతన్ని చూడలేదు. ముందు తలుపు తీసుకొని బయటికి నడిచాడు. చినిగిన నెక్కరు అంగిలోకి చల్లని గాలి చొరబడింది. హాయిగా అనిపించింది చెంద్రయ్యకు. 'గిప్పుడు ఊరికి ఇంటికి పోతె దొర నాయినను బతకనియ్యడు. ఇచ్చిన జీతం కక్కమంటడు. నాయిన గా పైసలు ఎక్కడ్నుంచి తెచ్చి యిస్తడు! ఊరికిపోతే దొర నన్ను ఒదలడు. మల్ల పట్టుకొస్తడు పట్నం. ఇగ ఊరికిపోను' అని ఆలోచిస్తూ చెంద్రయ్య రోడ్డు పొంటి నడిచాడు. ఏ గమ్యం లేకుండా చెంద్రయ్య చీకట్లో మాయమయ్యాడు.

"తప్పిపోయిండు" అని పోలీసు స్టేషన్‌లో రిపోర్టు వ్రాయించాడు దొర మర్నాడు.

- సుప్రభాతం, 4 సెప్టెంబర్ 1999